క్లుప్తంగా

నేడు పలు వార్డులలో రోడ్డు షో

తెనాలిఅర్బన్: ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్ సీపీ తెనాలి నియోజకవర్గ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు తెనాలి పట్టణ పరిధిలోని 26, 27, 28, 29, 30 వార్డులలో రోడ్డు షో నిర్వహించనున్నట్లు పార్టీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. రోడ్డు షోలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్‌లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వీధి వర్తకులకు గొడుగుల పంపిణీ



తెనాలిరూరల్: రోడ్డు వెంబడి చెప్పులు కుట్టుకుంటూ, ఆకు కూరలు అమ్ముకుని జీవించే చేతి వృత్తిదారులకు, వీధి వర్తకులకు లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ ఆధ్వర్యంలో సోమవారం భారీ గొడుగులను అందజేశారు. బోసరోడ్డులో చెప్పులు కుట్టి కుటుంబాన్ని పోషించుకునే మణి, మార్కెట్ కాంప్లెక్సు వద్ద ఆకుకూరలు అమ్ముకునే సుబ్బారెడ్డికి క్లబ్ సభ్యులు గొడుగులను అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ వ్యవస్థాపకుడు కాకరపర్తి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ క్లబ్ తరఫున చేపడుతున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా జంబో గొడుగులను పంపిణీ చేసినట్లు తెలిపారు. క్లబ్ కార్యదర్శి నేరెళ్ల కృష్ణమోహనరావు, డాక్టర్ కొత్తపల్లి రాజ్‌కుమార్, పొదర్తి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు



తెనాలిరూరల్: ఎన్నికల విధుల్లో భాగంగా రవాణా శాఖ అధికారులు తెనాలి నియోజకవర్గంలో విస్తృతంగా వాహనాలను సోమవారం తనిఖీ చేశారు. నియోజకవర్గ పరిధిలో చెంచుపేట, నందివెలుగు, పెదరావూరు వద్ద సాయంత్రం నుంచి రాత్రి వరకు 80 వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గుంటూరు ఎన్నికల సీజర్ మేనేజ్మెంట్ సిస్టం నోడల్ అధికారి కె.ప్రసాద్ మాట్లాడుతూ వాహన దారులు పరిమితికి మించి నగదు, ఇతర విలువైన ఆభరణాలు తీసుకువెళ్లేటప్పుడు వాటికి సంబంధించిన అనుమతి పత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. తనిఖీల్లో గుంటూరు ఆర్టీఓ ఎన్. గోపాల్, ఎంవీఐలు తోట రాఘవరావు, విజయసారథి, మల్లీశ్వరి, సౌజన్య, అనిల్‌కుమార్, మధుసూదనరావు, సిబ్బంది ఉన్నారు.

ధరలు పెంచకుండా సంక్షేమ పథకాలు అమలు చేయాలి

లక్ష్మీపురం: సంక్షేమ పథకాల పేరుతో ప్రజలకు ఇచ్చే వాటిని పార్టీలు పోటీ పడి ప్రకటిస్తున్నాయని, అదికాకుండా ప్రజల నుంచి పన్నులు ధరలు పెంచి ఎంత వసూలు చేస్తారో చెప్పాలని ఏపీ లీగల్ ఫోరం కన్వీనర్ అవధానుల హరి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్వర్యంలో సోమవారం పార్టీల మేనిఫెస్టోలపై చర్చగోష్ఠి నిర్వహించారు. విద్యావేత్త ఎస్.రవిబాబు మాట్లాడారు.

ఇద్దరు యువకుల దుర్మరణం

బైక్ అదుపు తప్పి ప్రమాదం

కృష్ణలంక(విజయవాడ తూర్పు): ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఇద్దరు యువకులు దుర్మరణం చెందిన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం మహానాడు 17వ రోడ్డులో బేగ్ రఫీ(21) భార్య సూఫియాతో కలిసి నివాసం ఉంటున్నాడు. వీరికి ఏడాదిన్నర క్రితం వివాహమైంది. రఫీ ఫంక్షన్లకు పూల డెకరేషన్ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం అతడి భార్య సూఫియా అశోక్‌నగర్‌లోని పుట్టింటికి వెళ్లింది. ఈ నేపథ్యంలో రఫీ తన భార్యను చూడడానికి బావమరిది షేక్ ఇర్ఫాన్(17)తో కలిసి ద్విచక్ర వాహనంపై ఆదివారం రాత్రి 11.30 గంటలకు ఇంటి నుంచి వారధి మీదుగా బయలుదేరాడు. నేతాజీ వంతెన దాటి స్క్యూ బ్రిడ్జి సమీపానికి వెళ్లగానే రాత్రి 12 గంటల సమయంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో ఇద్దరు కింద పడిపోవడంతో డివైడర్‌ను గుద్దుకుని రఫీ అక్కడికక్కడే మృతిచెందగా ఇర్ఫాన్ గాయాలపాలయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రఫీ మృతదేహాన్ని, గాయాలపాలైన ఇర్ఫాన్‌ను ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇర్ఫాన్ సోమవారం ఉదయం మృతి చెందాడు. మృతుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఐదేళ్ల పాలనకు ఓటరు తీర్పు కొలమానం

- తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి శివకుమార్
- స్థానికంగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపిన శివకుమార్‌కు ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల మద్దతు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్

తెనాలి: ఒక ఎమ్మెల్యే పనితీరుకు అయిదేళ్ల తర్వాత జరుగుతున్న ఎన్నికల్లో ఓటర్ల తీర్పే కొలమానమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తెనాలి అసెంబ్లీ అభ్యర్థి, సిటింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ దగ్గర్లోని అన్నాబత్తుని సత్యనారాయణ ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఉద్యోగులు తెనాలి అసెంబ్లీ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్‌కు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా సోమవారం సంఘ కార్యాలయంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో శివకుమార్ మాట్లాడారు. నవరత్నాలు పేరుతో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను నియోజకవర్గంలో గరిష్ఠంగా అందించేందుకు తాను కృషి చేసినట్లు గుర్తుచేశారు. రూ.1800 కోట్ల సంక్షేమాన్ని అందించటమే కాకుండా రికార్డు స్థాయిలో 27 వేల మందికి ఇళ్ల స్థలాలను పంపిణీ చేశామన్నారు. అదేవిధంగా గత 58 నెలల కాలంలో స్థానికంగా అందుబాటులో ఉంటూ, ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకున్నానని గుర్తుచేశారు. దాదాపు 6,245 శుభకార్యాలు, సమావేశాలకు హాజరైనట్టు చెప్పారు.

ప్రజలకు తాను చేసిన మంచిని అభినందిస్తూ మద్దతు తెలియజేసిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు ధన్యవాదాలు తెలియజేశారు. అసోసియేషన్ కోసం కార్యాలయాన్ని సమకూర్చుకుని తరచూ కలుసుకుంటూ సమస్యలు చర్చించుకోవటం బాగుందన్నారు. కార్యాలయానికి తన సొంత ఖర్చుతో సీలింగ్ పనులు చేయిస్తానని హామీ నిచ్చారు. పలువురు విశ్రాంత ఉద్యోగులు మాట్లాడుతూ స్థానికంగా ఉంటూ ఎప్పుడైనా ఎవరైనా కలుసుకుని సమస్యలు చెప్పుకోదగిన ఎమ్మెల్యే శివకుమార్‌కు తమ మద్దతు ఎప్పుడూ ఉంటుందన్నారు. ఎమ్మెల్యే శివకుమార్‌ను సత్కరించారు. మామిళ్లపల్లి చలపతిరావు, వి.రాఘవరావు, ఎం.బాబూరావు, కేవీ సుబ్బయ్య, అక్కిదాసు కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య పెద్దలను కలిసిన ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: తెనాలి అసెంబ్లీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, సిటింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ రోడ్ షోలు, ఆత్మీయ సభలు, పార్టీ వర్గాలతో అంతర్గత సమావేశాలతో బిజీగా ఉంటూనే అవకాశం ఉన్నప్పుడు ఓటర్లను వ్యక్తిగతంగా కలుస్తున్నారు. వారి నివాసాలకు వెళ్లి పలకరిస్తున్నారు. ఎన్నికల్లో తనకు ఓటు వేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సంక్షేమ ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకొచ్చేందుకు సహకరించాలని కోరుతున్నారు. ఈ క్రమంలో సోమవారం పట్టణ 21వ వార్డులోని ఆర్యవైశ్య ప్రముఖులను ఇంటింటికీ వెళ్లి కలిశారు. సీనియర్ సిటిజన్లు, బయటకు రాలేని ఆర్యవైశ్యులను స్వయంగా పలకరించటంతో వారు పరమానంద భరితులయ్యారు. మే 13న జరగనున్న పోలింగ్ రోజున ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి తనను, ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్యను గెలిపించాలని కోరటంతో అందరూ సానుకూలంగా స్పందించారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేస్తామని స్పష్టమైన హామీనిచ్చారు. తొలుత 21వ వార్డులోని శ్రీబాలత్రిపుర సుందరి సమేత శ్రీచంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో ఎమ్మెల్యే శివకుమార్ విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. అర్చకుల ఆశీర్వాదం తీసుకున్నారు. ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, పార్టీ తెనాలి క్లస్టర్-1 అధ్యక్షుడు మద్దాళి శేషాచలం, కౌన్సిలర్ గొడవర్తి సాయిహరేరామ్, పట్టణ మాజీ అధ్యక్షుడు దేసు శ్రీనివాసరావు, గ్రంధి సేతుమాధవరావు, గ్రంధి చంద్రమౌళి, పుప్పాల వరదరాజులు, నాళం రజిని, చుండూరు సాయి, సిల్వర్ భాస్కర్, చీమకుర్తి సతీష్, కనమర్లపూడి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సంక్షేమ సారథి జగనన్నకు పట్టం కడదాం

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్
- పట్టణంలోని 17, 18, 19, 20 వార్డుల్లో ఎన్నికల ప్రచారం
- గ్రామాల్లో స్వాగతం పలికిన మహిళలు, అభిమానులు



ఎన్నికల ప్రచారంలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి శివకుమార్

తెనాలిరూరల్: రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధిని ప్రజలకు చేరువ చేసిన సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ తెనాలి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని 17, 18, 19, 20 వార్డుల్లో సోమవారం సాయంత్రం నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కొత్త వంతెన వద్ద నుండి ప్రారంభించి వార్డుల్లోని పలు వీధుల్లో రోడ్డు షో నిర్వహించారు. మహిళలు, స్థానికులు స్వచ్ఛందంగా బయటకు వచ్చి పూలు జల్లి హారతులిచ్చారు. వార్డుల్లోని ప్రతి వీధుల్లో మహిళలు బయటకు వచ్చి శివకుమార్‌కు అభినందనలు తెలిపారు. హారతులిచ్చి పూల వర్షం కురిపించారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓటు వేస్తామని ప్రకటించారు. ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే అభ్యర్థి శివకుమార్ మాట్లాడుతూ గత 58 నెలల కాలంలో ప్రజలకు అందించిన సంక్షేమ ఫలాలతో పేద మధ్య తరగతి వారి జీవన ప్రమాణాలు మెరుగు పడ్డాయని అన్నారు. ప్రచారంలో భాగంగా గ్రామాలకు వెళితే ప్రజల నుంచి వస్తున్న ఆదరణే ఇందుకు నిదర్శనమని చెప్పారు. నియోజకవర్గంలో రూ.1800 కోట్లతో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, 27 వేల మందికి నివేశన స్థలాలు ఇచ్చినట్టు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పేరం సంజీవరెడ్డి, దుబాయ్‌బాబు, యాతాటి అనిల్, కోఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభానీ, వైఎస్సార్ సీపీ నాయకులు మద్దాళి శేషాచలం, మాజీ కౌన్సిలర్ దామర్ల విజయరాణి, పఠాన్ సుభాని(హోటల్), బొమ్ము నాగిరెడ్డి, టెక్స్ బాల, కావేటి నిర్మల, అక్కిదాసు కిరణ్‌కుమార్, గోల్డ్ రహిమా, మన్నవ ప్రభాకర్, పెనర్లంక రమణ, కావేటి ఈశ్వరరావు, తట్టుకుళ్ళ అశోక్ యాదవ్, అత్తోట అమృతరాజు, తాడిబోయిన పాలురాజు, కాళిదాసు సత్యం, టోపీ సుభానీ, కాళిదాసు వెంకటేశ్వరరావు, కొమ్ము భిక్షాల్ రాయల్, అవుతు రాజశేఖరరెడ్డి, బ్రదర్ ఆనందన్న, పెద్ద సంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



శివకుమార్‌ను భారీ గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

మా-ఏపీ ఆధ్వర్యంలో దర్శకుల దినోత్సవం

- ఏపీకు చెందిన సినీ దర్శకులకు సత్కారం
- మే4న దర్శకుల దినోత్సవం పురస్కరించుకుని కార్యక్రమం ఏర్పాటు



మాట్లాడుతున్న సినీ దర్శకుడు దిలీప్‌రాజా, కొత్త సుబ్రహ్మణ్యం

తెనాలి: ఆంధ్ర రాష్ట్రానికి చెందిన తొమ్మిది మంది సినీ దర్శకులను మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా-ఏపీ) ఆధ్వర్యంలో దర్శకుల దినోత్సవం రోజైన మే 4న తెనాలిలో వివిధ పురస్కారాలతో సత్కరించనున్నట్టు మా-ఏపీ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా వెల్లడించారు. స్థానిక రత్న ఫార్చ్యూన్ కల్యాణ మండపంలో సోమవారం సాయంత్రం ప్రముఖ పారిశ్రామిక వేత్త కొత్త సుబ్రహ్మణ్యం, సినీ నిర్మాత నన్నపనేని సుధాకర్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. దర్శక దిగ్గజం దాసరి నారాయణరావు జయంతి సందర్భంగా దాసరి స్మారక పురస్కారాన్ని జాతీయ అవార్డు గ్రహీత, అంకురం, మౌనం, శ్రీకారం చిత్రాల దర్శకుడు సి.ఉమా మహేశ్వరరావుకు అందజేస్తున్నట్టు తెలిపారు. దాసరి వద్ద శిష్యరికంలో సినిమాలకు పనిచేసి, తర్వాత 40 చిత్రాలకు దర్శకత్వం వహించిన భరత్ పారేపల్లిని కూడా దాసరి పురస్కారంతో సత్కరించనున్నట్టు తెలిపారు. సూపర్‌స్టార్ కృష్ణ పురస్కారాన్ని దర్శకుడు బోయపాటి కామేశ్వరరావుకు ప్రదానం చేస్తామన్నారు. దర్శకులు అచ్చన శ్రీనివాస యాదవ్, ఓం సాయి, బి.సోమసుందరం, 'దాడి' శ్రీనివాస్, చలువాది శివప్రసాద్, సువర్ణ ముఖర్జీలను మా-ఏపీ సత్కరిస్తుందని వివరించారు. మే 4న ఉదయం 11 గంటలకు రత్న ఫార్చ్యూన్ కల్యాణ మండపంలో ఏర్పాటయ్యే సభలో అతిథులుగా హీరోయిన్‌లు దివిజ, మౌనికారెడ్డి, ఇతర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. ఆహ్వాన కమిటీ సభ్యులు వేమూరి విజయభాస్కర్, మిలటరీ ప్రసాద్, దర్శకుడు కనపర్తి రత్నాకర్, వెంకీ రావణ్, శ్రీకాంత్, ఇంటూరి విజయభాస్కర్ పాల్గొన్నారు.

ముగిసిన అంతర్జాతీయ నృత్య ప్రదర్శనలు



నగరంపాలెం: బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలోని అన్నమయ్య కళావేదికపై శ్రీసాయి మంజీర కూచిపూడి ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ నృత్య దినోత్సవ వేడుకలు సోమవారంతో ముగిశాయి. తొలుత నటరాజ పూజ, నృత్య నివేదనంగా 108 మంది శరణం భవకరుణామయ తరంగాన్ని సంప్రదాయ దుస్తులతో నర్తించారు. సాయంత్రం జరిగిన సభకు సి.హెచ్.మస్తానయ్య జ్యోతి ప్రజ్వలన చేయగా, బూసురపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. పలువురు కళాకారులు నృత్యప్రదర్శనలు అలరించాయి. కూచిపూడి సిద్ధేంద్ర కళాక్షేత్రం ప్రధానోపాధ్యాయులు డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి, ఆచార్య పసుమూర్తి రామలింగేశ్వరశాస్త్రికి కూచిపూడి నాట్య విద్వాంసులు పసుమూర్తి కృష్ణమూర్తి జీవిత సాఫల్య పురస్కారం అందించారు. అదేవిధంగా పలువురు కళాకారులకు యువ కళారత్న పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి డాక్టర్ కాజా వెంకటసుబ్రహ్మణ్యం, కోశాధికారి వెంకటగిరి నాగలక్ష్మి, పెద్ది మాధవి, బత్తుల రాధిక పాల్గొన్నారు.

తెనాలి ఎన్నికల బరిలో 13 మంది అభ్యర్థులు

ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ

తెనాలిరూరల్: సార్వత్రిక ఎన్నికల్లో తెనాలి బరిలో 13 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. నామినేషన్ల ఉపసంహరణ సోమవారంతో ముగిసింది. ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన అన్నాబత్తుని పుష్ప నామినేషన్‌ను ఉపసంహరించుకోవడంతో 13 మంది అభ్యర్థులు బరిలో మిగిలారు. ఈ నెల 25వ తేదీతో నామినేషన్ల గడువు ముగియగా మొత్తం 20 మంది అభ్యర్థులు 27 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. 26వ తేదీన జరిగిన స్క్రూటినీలో ఆరుగురు అభ్యర్థుల నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రఖర్ జైన్ తిరస్కరించారు. 14 మంది పోటీలో నిలువగా ప్రస్తుతం పుష్ప నామినేషన్ ఉపసంహరణతో 13 మంది పోటీలో నిలిచారు. వీరిలో ప్రధాన పార్టీలు వైఎస్సార్ సీపీ, జనసేన తరఫున అన్నాబత్తుని శివకుమార్, నాదెండ్ల మనోహర్ పోటీ చేస్తుండగా బీఎస్పీ తరఫున కారుమంచి సునీల్ సందీప్, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ నుంచి అమానుల్లా ఖాన్ పఠాన్, తెలుగు జనతా పార్టీ నుంచి కొండూరి నాగరాజు, తెలుగు విజయం పార్టీ నుంచి చుక్కపల్లి ప్రసాద్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి జంకా మల్లికార్జునరావు, సీపీఐ(ఎంఎల్) నుంచి శావల గోపాల్, జై భారత్ నేషనల్ పార్టీ నుంచి షేక్ బాషా పోటీలో ఉన్నారు. ఇండిపెండెంట్ అభ్యర్థులుగా గడే రామకృష్ణ, తుమపాల నరేంద్ర, యంద్రపాటి అశోక్, లక్ష్మణమూర్తి కోట పోటీ చేస్తున్నారు. కాగా పీసీసీ అధ్యక్షురాలు షర్మిల చేసిన పొరపాటు కారణంగా కాంగ్రెస్ పార్టీ తరఫున ఇద్దరు అభ్యర్థులు వేసిన నామినేషన్లను రిటర్నింగ్ అధికారి తిరస్కరించిన సంగతి తెలిసిందే.

పోస్టల్ బ్యాలెట్ ఏర్పాటు పనులను చేపట్టాలి

నెహ్రూనగర్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా గుంటూరు తూర్పు నియోజకవర్గం ఈవీఎంల కమిషనింగ్, పోస్టల్ బ్యాలెట్‌ల ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాట్లను ఏసీ కాలేజీలో వేగంగా పూర్తి చేయాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి(ఆర్ఓ) కీర్తి చేకూరి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక ఏసీ కాలేజ్‌లో జరగనున్న ఈవీఎంల కమిషనింగ్, పీఓలకు శిక్షణ, పోస్టల్ బ్యాలెట్ ఏర్పాట్లపై అధికారులతో కలసి ఆమె పరిశీలించి మాట్లాడుతూ, గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఈ నెల 3,4 తేదీల్లో ఈవీఎంల కమిషనింగ్ కు ఏసీ కాలేజిలో ఏర్పాట్లను వేగంగా చేపట్టాలన్నారు. అదేవిధంగా 5,6 తేదీల్లో జరిగే పీ ఓ, ఏపీఓలకు శిక్షణ తరగతులకు, 5 నుండి 8 వరకు పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌కు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఏఆర్ఓ, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఏసీపీ మురళి, డీఈఈ రమేష్ బాబు, మేనేజర్ ఎస్ఎస్ ప్రసాద్, సూపరింటెండెంట్ పద్మనాభరావు, ఏఈ సునీల్ కుమార్ పాల్గొన్నారు.

రూ. 7 లక్షల నగదు స్వాధీనం

గుంటూరు వెస్ట్: ఎన్నికల వేళ నోట్ల కట్టలు బయటపడుతున్నాయి. సోమవారం పేరేచర్ల వద్ద తనిఖీ బృందం అధికారి స్వాతి ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో రూ.7 లక్షలు పట్టుబడింది. నగదుతో పాటు, వాహనంలో ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

బీజేపీతో ముస్లిం మైనార్టీల రిజర్వేషన్‌కు ముప్పు

- వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ విభాగం నేతల ఆందోళన
- ముస్లిం సమాజానికి మేలు చేస్తున్న వైఎస్సార్ సీపీకే మద్దతిస్తామని ప్రకటన



వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమని విక్టరీ సంకేతాన్ని చూపుతున్న ముస్లిం నేతలు

తెనాలి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు ఎంతో మేలు చేసిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనారిటీ విభాగం వెల్లడించింది. విపక్ష కూటమిలో భాగమైన బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు తొలగిస్తామని ప్రకటించటం ముస్లిం సమాజానికి తీవ్ర నష్టం కలిగించటమేనని ఆ విభాగం నాయకులు ఆందోళన వ్యక్తంచేశారు. ముస్లిం సమాజానికి మేలు చేస్తున్న వైఎస్సార్ సీపీకే తమ మద్దతని ముక్తకంఠంతో ప్రకటించారు. స్థానిక గంగానమ్మపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ముస్లిం మైనార్టీ విభాగం పట్టణ అధ్యక్షుడు షేక్ జిలాని, ముస్లిం నేతలు రెహమాన్ తదితరులు మాట్లాడారు. ఏపీలో బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలు కలిసి కూటమిగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో ఈవీఎంల్లో ఓటు ఏ పార్టీకి వేసినప్పటికీ అది బీజేపీకే వెళుతుందన్న ప్రచారం కూడా ఉందన్నారు. ఇదే నిజమైతే ముస్లిం సమాజానికి ప్రమాదకరమన్నారు. తెలంగాణలో ఎన్నికల సభలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా మాట్లాడిన మాటలను చూస్తుంటే బీజేపీ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే ముస్లిం రిజర్వేషన్లు రద్దుచేస్తారని భావిస్తున్నట్టు తెలిపారు. అందుకే ప్రతి ముస్లిం బీజేపీ కూటమికి ఓటు వేయరాదని, తమ సంక్షేమానికి తోడ్పడుతున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థులకే ఓటు వేయాలని కోరారు. వీరితో గఫూర్, సుభాని, ఆదామ్, షేక్ గౌస్, టెక్స్ బాల, ఎస్ఎం సాధిక్, షేక్ కరిముల్లా, షేక్ మౌలాలి, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

హోమ్ ఓటింగ్‌ను అత్యంత జాగ్రత్తగా చేపట్టాలి

తూర్పు ఆర్ఓ కీర్తి చేకూరి



అధికారులతో సమావేశమైన తూర్పు ఆర్ఓ కీర్తి

నెహ్రూ నగర్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మే 8వ తేదీ నుండి ప్రారంభమయ్యే హోం ఓటింగ్‌ని అత్యంత జాగ్రత్తగా చేపట్టాలని, హోం ఓటింగ్ సమయంలో పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి పోలింగ్ ఏజెంట్లు కూడా ఉంటారని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి తెలిపారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో హోం ఓటింగ్, ఈవీఎంల కమిషనింగ్, ఫెసిలిటేషన్ సెంటర్స్ అంశాలపై ఏఆర్ఓలతో కలసి సెక్టార్ అధికారులు, హోం ఓటింగ్ బృందాలు, పోస్టల్ బ్యాలెట్ బృందాల సభ్యులకు అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల విధానంపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. హోం ఓటింగ్ సమయంలో పూర్తి స్థాయిలో వీడియోగ్రఫీ రికార్డ్ చేయబడుతుందని వివరించారు. ఓటింగ్ రహస్య బ్యాలెట్ పద్ధతిలో జరగాలని, ఓటు వేసే వారికి ప్రత్యేక కంపార్ట్మెంట్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. శాంతి భద్రతల పర్యవేక్షణకు పోలీసు సిబ్బంది ఉంటారన్నారు. తూర్పులో హోమ్ ఓటింగ్ కోసం ఐదు బృందాలు ఏర్పాటు చేశామని, ఆయా బృందాలను పర్యవేక్షణకు ఏఆర్ఓ ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో మైక్రో అబ్జర్వర్ టీంలను కూడా నియమించామన్నారు. క్షేత్ర స్థాయిలో సహకరించని బీఎల్ఓల వివరాలు వెంటనే ఏఆర్ఓల దృష్టికి తీసుకురావాలని, వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏఆర్ఓలు సునీల్ కుమార్, భీమరాజు, ప్రదీప్ కుమార్, వెంకటలక్ష్మి, డిప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, మేనేజర్ ఎస్.ఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

కృష్ణసాయికి డాక్టరేట్ ప్రదానం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫార్మసీ విభాగ పరిశోధకుడు టీవీ కృష్ణసాయికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని రీసెర్చ్‌సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.కిరణ్మయి తెలిపారు. ఫార్మసీ పరిశోధనా పర్యవేక్షకులు డాక్టర్ పి.రవి పర్యవేక్షణలో 'ఫైటోకెమికల్ స్క్రీనింగ్ అండ్ న్యూరోఫార్మాకాలాజికల్ స్టడీస్ ఆన్ సర్టెయిన్ ట్రెడిషనల్ ప్లాంట్స్' అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించినందుకుగాను కృష్ణసాయికి డాక్టరేట్ ప్రదానం చేయడం జరిగిందన్నారు

ధూళిపాళ్ల సుబ్బారావు ధన్యజీవి

సీపీఎం పార్టీ గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు



సుబ్బారావు భౌతిక దేహం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఎం నేతలు

అనంతవరం(తెనాలి): అమరజీవి కామ్రేడ్ ధూళిపాళ్ల సుబ్బారావు ధన్యజీవి అని సీపీఎం పార్టీ గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు నివాళులర్పించారు. తెనాలి సమీపంలోని అనంతవరంలో మృతి చెందిన సుబ్బారావు భౌతిక కాయాన్ని సోమవారం ఆయన సందర్శించి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చివరి వరకు కమ్యూనిస్టుగా అనేక ఆటుపోట్లకు తట్టుకుని పేదప్రజల పక్షాన నిలబడిన విశిష్ట వ్యక్తి సుబ్బారావు అని అన్నారు. పార్టీ కోసం, పార్టీ భవనాల నిర్మాణం కోసం భారి విరాళాలనిస్తూ పార్టీని ఆదుకోవటమే కాకుండా పార్టీ కార్యకర్తల అవసరాల్ని గుర్తించి, ఆర్థికంగా చేయూత నిచ్చిన విశిష్టవ్యక్తి మరణం పార్టీకి తీరని లోటని అన్నారు. వుచ్చలపల్లి సుందరయ్య అనంతవరం గ్రామంలో సర్వే చేసినపుడు సుబ్బారావు దగ్గరుండి చేదోడుగా నిలిచారని గుర్తు చేశారు. కూలిరేట్ల పోరాటాలు, ఇళ్ల స్థలాలు, రైతాంగ సమస్యలపైనా ముందు నిలబడినట్లు వివరించారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి, నాయకులు కంతేటి శ్రీమన్నారాయణ, కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తోడేటి సురేష్‌లు పాల్గొన్నారు.

టీజేపీఎస్ కళాశాలలో వైద్య శిబిరం

గుంటూరు ఎడ్యుకేషన్: పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో సోమవారం రమేష్ ఆస్పత్రి వైద్య బృందంతో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ తెలిపారు. రక్తపోటు, మధుమేహ, ఊపిరితిత్తులు, గుండె, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరంలో రమేష్ ఆస్పత్రి వైద్య బృందంతో పాటు అధ్యాపకులు జేవీ సుధీర్‌కుమార్, పి.కుమార్ రాజా, జి.సురేష్‌బాబు పాల్గొన్నారు.

నర్సింగ్ సూపరింటెండెంట్ ఉద్యోగ విరమణ

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్ గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న చలువాది కమలకుమారి మంగళవారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. జీజీహెచ్ ప్రభుత్వ నర్సింగ్ పాఠశాలలో నర్సింగ్ కోర్సు అభ్యసించిన ఆమె సుమారు 39 సంవత్సరాల పాటు స్టాఫ్‌నర్సుగా, హెడ్‌నర్సుగా నర్సింగ్ సూపరింటెండెంట్‌గా వివిధ హోదాల్లో రోగులకు వైద్య సేవలు అందించారు. పదవీ విరమణ సందర్భంగా మంగళవారం ఆస్పత్రిలోని శుశ్రుత హాలులో కమలకుమారిని ఘనంగా సన్మానిస్తున్నట్లు నర్సింగ్ సిబ్బంది తెలిపారు.

జై భీమ్ పుస్తకావిష్కరణ



నెహ్రూ నగర్: జై భీమ్ పుస్తకాన్ని ఎమ్మెల్సీ అప్పిరెడ్డి సోమవారం ఆవిష్కరించారు. బొంగరాలబీడులో దారువాక యువజన సంఘం అధ్యక్షులు చిన్నం డేవిడ్ విలియమ్స్ ఆధ్వర్యంలో దళిత శ్రీ సాహితీ పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షురాలు రచించిన జై భీమ్ పుస్తకాన్ని అప్పి రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగిందని విలియమ్స్ పేర్కొన్నారు. అంబేద్కర్ భావజాలాన్ని ముందుకు తీసుకెళ్లడమే తమ ఏకైక లక్ష్యమని ఈ సందర్భంగా విలియమ్స్ పేర్కొన్నారు.